# ఫోగాట్ పతక గర్జన

## ఒలింపిక్స్ ఫైనల్ చేరిన తొలి మహిళా రెజ్లర్

**సెమీస్‌లో క్యూబా రెజ్లర్‌పై అద్భుత విజయం • క్వార్టర్స్‌లో వరల్డ్ చాంపియన్ సుసాకీకి షాక్**

అరుదైన రికార్డు సొంతం



**భారత రెజ్లింగ్ చరిత్రలో సరికొత్త సంచలనం. గత రెండు ఒలింపిక్స్‌లలో భారీ అంచనాల నడుమ బరిలోకి దిగి రిక్తహస్తాలతో వెనుదిరిగిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ 'పారిస్'లో మాత్రం 'పసిడి పట్టు'కు సిద్ధమైంది. మహిళల 50 కిలోల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఫోగాట్ తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన, అసలు ఓటమంటేనే అర్థం తెలియని జపాన్ రెజ్లర్ యు సుసాకీకిని మట్టికరిపించిన ఆమె.. ఆ తర్వాత క్వార్టర్స్, సెమీస్‌లోనూ గెలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. తద్వారా ఈ ఎడిషన్‌లో భారత్‌కు నాలుగో పతకం అందించేందుకు సిద్ధమైంది. అంతేగాక ఇప్పటిదాకా వచ్చిన మూడు కాంస్యాలకు భిన్నంగా స్వర్ణం లేదా రజతం సొంతం చేసుకునే అద్భుత అవకాశం ఆమె ముందుంది. మొదలు సుసాకీని, క్వార్టర్స్‌లో యూరోపియన్ మాజీ చాంపియన్ ఒక్సానా లివాచ్‌ను ఓడించిన ఆమె సెమీఫైనల్స్‌లో క్యూబా రెజ్లర్ జుమాన్ లోపెజ్‌ను ఓడగొట్టింది.**

పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ సంచలన ప్రదర్శనతో పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గతేడాది దేశ క్రీడారంగంలో 'వార్త'గా నిలిచిన ఆమె తన బాధనంతా పంటి కింద బిగపట్టి విశ్వక్రీడల్లో అత్యద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మంగళవారం మహిళల ఫ్రీస్టయిల్ 50 కిలోల సెమీఫైనల్స్‌లో ఫోగాట్.. 5-0తో యుస్నెలిస్ గుజమన్ (క్యూబా)ను ఓడించి స్వర్ణ పతక రేసులో నిలిచింది. తద్వారా తాజా ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం లేదా రజతం అందించే అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటి వరకు భారత్‌కు మూడు కాంస్య పతకాలు రాగా అవి షూటింగ్‌లో వచ్చినవే. రెజ్లింగ్ ఫైనల్ చేరడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా వినేశ్ నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్ నుంచి ఈ క్రీడల్లో ఆడుతున్న ఫోగాట్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. బుధవారం జరిగే ఫైనల్‌లో ఆమె యూఎస్‌ఏకు చెందిన హిల్డెబ్రండ్ట్ సారాతో అమీతుమీ తేల్చుకోనుంది.

### అలా మొదలై..

ఏడాదంతా పోరాటాలు, ఆందోళనలు, వివాదాల నడుమ పారిస్ బరిలో నిలిచిన వినేశ్‌కు తొలి బౌట్‌లోనే సుసాకీ వంటి దీటైన ప్రత్యర్థి ఎదురైంది. ప్రపంచ 60వ ర్యాంకర్ అయిన ఆమెకు ఇటీవల కాలంలో ఫామ్ అంతంతమాత్రమే కాగా ఈ మ్యాచ్‌కు ముందు వరల్డ్ నంబర్‌వన్ ర్యాంకర్, అంతర్జాతీయ కెరీర్‌లో అసలు ఓటమన్నదే లేని సుసాకీతో వినేశ్ పోటీ అంటే అందరూ జపాన్ అమ్మాయే ఫేవరేట్ అనుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు అంతర్జాతీయ రెజ్లింగ్ కెరీర్‌లో సుసాకీ రికార్డు 82-0. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, నాలుగు సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఘనమైన రికార్డు ఆమెకుంది. కానీ సుసాకీకి తొలిసారి పరాభవాన్ని పరిచయం చేస్తూ వినేశ్ సంచలనం సృష్టించింది. తన అనుభవన్నంతా రంగరించి 'పట్టు'దలతో ఆమె చేసిన పోరాటానికి సుసాకీ తలొంచక తప్పలేదు. తొలి బౌట్ 90 సెకన్ల పాటు ఇరువురూ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేందుకు యత్నించారు. దీంతో సుసాకీ వ్యూహం మార్చి దూకుడు పెంచింది. రెండో బౌట్ సగం ముగిసేదాక వినేశ్ 0-2తో వెనుకబడే ఉంది. కానీ మరో 20 సెకన్లలో ఆట ముగుస్తుందనగా మొదలైంది అసలు కథ. సుసాకీ ఎడమ కాలును ఉడుము పట్టినట్టు పట్టిన వినేశ్ ఆమెను మ్యాట్‌పై పడేసింది. అంతే..! 3-2తో మ్యాచ్ గెలిచిన వినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సుసాకీతో మ్యాచ్‌లో ఇచ్చిన గెలుపుతో వినేశ్ క్వార్టర్స్‌లో రెచ్చిపోయింది. రెండో మ్యాచ్‌లో 7-5తో ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానా లివాచ్‌నూ మట్టికరిపించి సెమీస్‌కు అర్హత సాధించింది.



### సెమీస్‌లో..


కీలక సెమీస్‌లోనూ వినేశ్ దూకుడు చూపించింది. ఆత్మవిశ్వాసంతో మ్యాట్‌పైకి వచ్చిన ఆమె.. బౌట్ ఆరంభమైన కొద్దిసేపటికే ప్రత్యర్థిని కింద పడేసి హాఫ్ టైమ్ ముగిసేసరికి 2 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలిచింది. రెండో బౌట్‌లో జుమాల్ రెండు కాళ్ల మధ్య అష్టదిగ్బంధనం వేసినట్టుగా మంత్రం వేయడంతో జుమాల్ ఆ పట్టును విడిపించుకోలేక చతికిలపడింది.

**1** ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో మహిళల విభాగంలో ఫైనల్ చేరిన తొలి రెజ్లర్.

**2** సాక్షి మాలిక్ తర్వాత ఒలింపిక్ పతకం గెలవబోతున్న రెండో ప్లేయర్

**3** ఈ క్రీడలో సుశీల్ కుమార్, రవి దహియా తర్వాత ఫైనల్స్‌కు అర్హత సాధించిన మూడో రెజ్లర్.





## పడి లేచిన కెరటం

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

'రెజ్లింగ్‌లో ఆమె కథ ముగిసింది! అందుకే ఈ పస లేని ఆరోపణలు, ఆందోళనలతో పబ్బం గడుపుకుంటుంది!!' ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సహచర రెజ్లర్లతో కలిసి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై గతేడాది లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినప్పుడు వినేశ్ ఫోగాట్‌పై వచ్చిన కామెంట్లు అవి. సాక్షి మాలిక్, బజరంగ్ పునియాతో పాటు మరికొంత మంది రెజ్లర్లతో దేశ రాజధానిలో చేసిన నిరసనలకు ఆమె నేతృత్వం వహించింది. దీనిపై భిన్న వాదనలు వినిపించినా ఏడాదికాలంగా టోర్నీలు లేకపోవడంతో కడుపు మండిన పలు రెజ్లర్లు 'కొంతమంది స్వార్థం కోసమే ఈ ఆందోళనలు చేస్తున్నారు' అని విమర్శలు గుప్పించినా వినేశ్ పోరాటాన్ని ఆపలేదు. గతేడాది దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా అటువైపుగా శాంతియుత ర్యాలీ తీసిన రెజ్లర్లపై పోలీసులు లాఠీచార్జికి దిగడం, వారిని అరెస్ట్ చేయడం చూసి దేశమంతా నివ్వెరపోయింది. పోలీసులు సైతం రెజ్లర్ల గొంతు నొక్కి, వారిని బందిపోటు దొంగల్లా ఈడ్చుకురావడం చూసి చలించని క్రీడాభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. ఈ పోరాటానికి నేతృత్వం వహించినవారిలో ముఖ్యురాలిగా ఉన్న వినేశ్‌పై సోషల్ మీడియాలో ఒక పార్టీ అండతో అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకర వ్యాఖ్యానాలు, టీవీ చర్చలలో సూటిపోటి మాటలతో వేధించడం చూసి దేశ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఒకవైపు ప్రభుత్వం బేటీ బచావో నినాదాలు ఇస్తూ దేశంలో మహిళా క్రీడాకారులను అవమానపరుస్తున్నదని వారికి అండగా దేశం మొత్తం గొంతు కలిపింది. అసలు ఆ సమయంలో వినేశ్ 'పారిస్'కు అర్హత సాధిస్తుందని కూడా ఎవరూ అనుకోలేదు. దీనికి తోడు కొంతకాలంగా ఆమె గాయాలతోనే సావాసం చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఓటములే పలకరించడంతో చాలా మంది ఆమె కెరీర్‌కు శుభం కార్డు పడ్డట్టే అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే తన సహచర రెజ్లర్ అమిత్ పంగల్ సైతం వినేశ్‌ను ఆసియా చాంపియన్‌షిప్‌లో ట్రయల్స్ నిర్వహించకుండా నేరుగా ఎంపిక చేయడం పట్ల కోర్టు మెట్లెక్కడం ఆమెను మరింత కలవరపరిచింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. మానసికంగా ఎంతో వేదన అనుభవించినా వినేశ్ పోరాటాన్ని మాత్రం వీడలేదు. తనకు చివరి ఒలింపిక్స్ (?)గా భావిస్తున్న పారిస్‌లో పతకం ఖాయం చేసుకున్న ఆమె తనపై కారుకూతలు కూసినవారికి పతకంతోనే చెంప చెల్లుమనే సమాధానం చెప్పింది. సుసాకీపై గెలిచిన తర్వాత ఆమె ముఖంలో కనిపించిన భావోద్వేగాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం!

కాంస్య పతక పోరు
ఆగస్టు-8: భారత్ X స్పెయిన్



## కాంస్య పోరుకు భారత్

**సెమీస్‌లో జర్మనీ చేతితో ఓటమి • పోరాడి ఓడిన టీమ్‌ఇండియా**

పారిస్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో వరుస విజయాలతో దుమ్మురేపిన భారత్ కీలక పోరులో తడబడింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పసిడి పోరుకు అర్హత సాధిస్తుననుకున్న టీమ్‌ఇండియా సెమీఫైనల్ పోరులో నిరాశపరిచింది. మంగళవారం ఆఖరి నిమిషం వరకు హోరాహోరీగా సాగిన పోరులో భారత్ 2-3 తేడాతో జర్మనీ చేతిలో పోరాడి ఓడింది. మ్యాచ్ ఆద్యంతం ఇరు జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. గత(టోక్యో) ఒలింపిక్స్‌లో తమకు ఎదురైన ఓటమికి పారిస్‌లో భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. మ్యాచ్ మొదలైన తొలి రెండు నిమిషాల్లోనే టీమ్‌ఇండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. భారత్ తరపున కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(7ని), సుఖ్‌జీత్‌సింగ్(36ని) గోల్స్ చేశారు. మరోవైపు గొంజాలో పిలియట్(18ని), క్రిస్టోఫర్ రర్(27ని), మార్కో మిల్టక్(54ని) జర్మనీకి గోల్స్ అందించారు. మ్యాచ్ విషయానికొస్తే తొలి క్వార్టర్ ఏడో నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్‌సింగ్ అద్భుత రీతిలో గోల్‌గా మలువడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో క్వార్టర్ మొదట్లోనే పిలియట్..పెనాల్టీ కార్నర్ గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. మరో తొమ్మిది నిమిషాల తేడాతో క్రిస్టోఫర్ గోల్ చేయడంతోజర్మనీకి 2-1 ఆధిక్యం దక్కింది. మ్యాచ్‌పై పట్టు కోల్పోతున్న సమయంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్‌తో భారత్ పోటీలోకి వచ్చింది. సమంగా సాగుతున్న మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా మార్కో ఫీల్డ్ గోల్‌తో జర్మనీ మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకుంది. ఆఖరి క్షణంలో భారత్‌కు గోల్ చేసే అవకాశం వచ్చినా..తృటిలో చేజారిపోయింది. గురువారం భారత్, స్పెయిన్ మధ్య కాంస్య పోరు జరుగనుండగా, పసిడి కోసం నెదర్లాండ్స్, జర్మనీ తలపడనున్నాయి.

**2** జర్మనీతో సెమీస్ మ్యాచ్‌లో భారత్‌కు మొత్తం 12 పెనాల్టీ కార్నర్ అవకాశాలు దక్కితే కేవలం రెండింటిని మాత్రమే గోల్స్‌గా మలిచింది. మరోవైపు జర్మనీ ఏడింటిలో ఒకటి గోల్ చేసింది.

**48** సెమీస్ మ్యాచ్‌లో భారత్ 48 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకుంటే..52 శాతం జర్మనీ ఖాతాలో వేసుకుంది.

## సాహో నీరజ్

జావెలిన్‌త్రో ఫైనల్‌కు స్టార్ అథ్లెట్

తొలి ప్రయత్నంలోనే
**89.34**
మీటర్ల దూరం

క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానం

**భారత బల్లెం వీరుడు నీరజ్‌చోప్రా..పతక వేటకు దిగాడు. తాను పోటీకి దిగనంత వరకే..! ఒక్కసారి అడుగుపెడితే పతకం పక్కా అన్న రీతిలో పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ అదరగొట్టాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా నీరజ్ తన తొలి ప్రయత్నంలో ప్రత్యర్థులు ఇక కాస్కోండి అంటూ హెచ్చరికలు పంపాడు. వేలాది మంది ప్రేక్షకులతో కిక్కిరిసిన స్టేడియంలో బరిసెను 89 మీటర్ల దూరం విసిరి ఔరా అనిపించాడు. ప్రత్యర్థులు కనీసం అతని దరిదాపులను కూడా అందుకోలేకపోయారు. గురువారం జరిగే ఫైనల్లోనూ ఇదే రీతిలో బరిసెను విసిరితే భారత్ స్వర్ణ సంబురం సాకారమైనట్లే.**



పారిస్: ఎవరి అంచనాలకూ అందకుండా టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన 'బల్లెం వీరుడు' నీరజ్ చోప్రా 'పారిస్'లో దానిని నిలబెట్టుకునేందుకు వేట మొదలుపెట్టాడు. మంగళవారం ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈటెను 89.34 మీటర్లు విసిరిన అతడు అగ్రస్థానంతో ఫైనల్స్‌లో ఘనంగా అడుగుపెట్టాడు. ఈ సీజన్‌లో నీరజ్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కాగా మొత్తంగా రెండో (2022లో 89.94 మీటర్లు)ది. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-ఏ లో జర్మన్ అథ్లెట్ వెబర్ జులియన్ 87.76 మీటర్లతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గ్రూప్-బీతో పాటు రెండు గ్రూపులలోనూ నీరజ్‌దే అత్యుత్తమ ప్రదర్శన. ఓవరాల్‌గా గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (88.63 మీటర్లు), వెబర్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ 86.59 మీటర్లతో 4వ స్థానంలో నిలిచాడు. అర్హత రౌండ్స్‌లో జావెలిన్‌ను 84 మీటర్లు దాటిన వాళ్లు ఫైనల్స్‌కు వెళ్తారు. రెండు గ్రూపులలో కలిసి ఫైనల్స్‌కు 12 మంది క్వాలిఫై అయ్యారు. భారత్‌కే చెందిన కిషోర్ జెన 80.73 మీటర్లతో క్వాలిఫికేషన్ రౌండ్స్‌లోనే తేలిపోయాడు.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | యూఎస్‌ఏ | 22 | 30 | 29 | 81 |
| 2 | చైనా | 22 | 20 | 15 | 57 |
| 3 | ఆస్ట్రేలియా | 14 | 12 | 9 | 35 |
| 4 | ఫ్రాన్స్ | 13 | 16 | 19 | 48 |
| 5 | బ్రిటన్ | 12 | 15 | 18 | 45 |
| 6 | కొరియా | 11 | 8 | 7 | 26 |
| 60 | భారత్ | 0 | 0 | 3 | 3 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## ముగిసిన అబ్బాయిల పోరాటం

టేబుల్ టెన్నిస్‌లో భారత పురుషుల పోరాటానికి తెరపడింది. సింగిల్స్ పోటీలలో దారుణంగా విఫలమైన ఆచంట శరత్ కమాల్, హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్ టీమ్ ఈవెంట్‌లోనూ చేతులెత్తేశారు. ప్రిక్వార్టర్స్‌లో భారత్ 0-3తో చైనా చేతిలో ఓడింది. హర్మీత్-మానవ్ తొలి డబుల్స్ ఓడగా సింగిల్స్‌లో తన కెరీర్‌లో చివరి ఒలింపిక్స్ ఆడుతున్న శరత్ సైతం పరాభవం పాలయ్యాడు. రెండో సింగిల్స్‌లో మానవ్ సైతం నిష్క్రమించడంతో భారత్ కథ ముగిసింది. మహిళల టీటీ జట్టు క్వార్టర్స్ పోరులో భాగంగా బుధవారం జర్మనీతో తలపడనుంది.

## 6.25 మీటర్ల ఎత్తు దూకాడు

**స్వీడన్ అథ్లెట్ అర్మాండ్ ప్రపంచ రికార్డు.. ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్డ్**



పారిస్: ఆకాశమే అతని హద్దు! రెక్కలు కట్టుకుని గాలిలో విహరించినట్లు అతను అలవోకగా విహరిస్తాడు. అతని అద్భుత ప్రదర్శనకు ప్రపంచ రికార్డులు దాసోహమంటాయి. అతనెవరో కాదు పారిస్ ఒలింపిక్స్‌లో డెన్మార్క్ పోల్‌వాల్ట్ మ్యాస్ట్రో అర్మాండ్ డుప్లాంటిస్ కొత్త చరిత్ర లిఖించాడు. మానవ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో అర్మాండ్ ఏకంగా 6.25 మీటర్లు ఎత్తు దూకి పసిడి పతకాన్ని సగర్వంగా ముద్దాడాడు. మంగళవారం జరిగిన పురుషుల పోల్‌వాల్ట్ ఈవెంట్ ఫైనల్లో అర్మాండ్ 6.25 మీటర్లతో అగ్రస్థానంతో వరుసగా మూడోసారి ఒలింపిక్ స్వర్ణాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో ఓవరాల్‌గా తన కెరీర్‌లో ఏకంగా తొమ్మిదోసారి ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. 80,000 మంది ప్రేక్షకుల సమక్షంలో అర్మాండ్ చిరస్మరణీయ విజయాన్ని ఆస్వాదించాడు. టర్కీ వెటరన్ షూటర్ యూసుఫ్ డికెక్‌ను అనుసరిస్తూ సంబురాలు చేసుకున్నాడు. అన్నట్లు ఈ పోటీలో కెంద్రిక్స్(5.95మీ, అమెరికా), కరాలిస్(5.90, గ్రీస్) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.